పశువులకు అందని వైద్యం

- మూడేళ్ల క్రితం డిప్యూటేషన్‌పై వెళ్లిన ఇద్దరు వైద్యులు
- తెరుచుకోని పశువైద్యకేంద్రాలు
- పట్టించుకోని అధికారులు


మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం

నార్నూర్: మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. గత పదేళ్లుగా నార్నూర్, గాదిగూడ మండలంలోని పశువైద్య కేంద్రాలకు వైద్యులు లేకపోవడంతో రైతులు బాలమిత్ర, ప్రైవేట్ వ్యక్తులపై ఆధారపడుతున్నారు. పశువులకు వైద్యం అందకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నార్నూర్, తాడిహత్నూర్, గాదిగూడలో మూడు పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. నార్నూర్, తాడిహత్నూర్ పశువైద్య కేంద్రంలో గత మూడేళ్ల క్రితం వైద్యులు దివ్య భారతి, అపర్ణలను అప్పటి ప్రభుత్వం నియమించింది. వారు వారం రోజులు మాత్రమే విధులు నిర్వహించి గద్వేల్ జిల్లాకు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. అంతకుముందు ఐదేళ్లు, ప్రస్తుతం మూడేళ్లుగా వైద్యులు లేక పశువైద్య కేంద్రం తెరుచుకోనిలేని పరిస్థితి. అయితే ఏజెన్సీ ప్రాంతంలో మూగజీవాలకు వైద్యం అందక ప్రాణాలు పోతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా డిప్యూటేషన్‌పై..

నార్నూర్, తాడిహత్నూర్ పశువైద్య కేంద్రాల్లో పని చేయాల్సిన వైద్యులు రాజకీయ పలుకుబడితో వారి సొంత ప్రాంతంలో గత మూడేళ్లుగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రతినెల జీతం మాత్రం రెండు పశువైద్య కేంద్రం ద్వారానే తీసుకుంటున్నారు. రెండురోజుల క్రితం డాక్టర్ వంశీకిరణ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఇన్‌చార్జీలు సైతం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అంతా ఇష్టానుసారంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి పశువైద్యులను నియమించాలని గిరిజనులు కోరుతున్నారు.

జిల్లాలో మూగజీవాల వివరాలు

గేదెలు48,650, ఆవులు 3,11,182, మేకల1,86,469, పందులు1890, కుక్కలు 5267, కుందేలు70, కోళ్లు5,47,969, పక్షులు 5789, గొర్రెలు 1,53,214

ఉన్నతాధికారుల దృష్టికి..

రెండు రోజులు క్రితం నార్నూర్ పశువైద్య కేంద్రం ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించాను. నాకు ఇంకా ఇక్కడ పూర్తి సమాచారం తెలియదు. ఏమైన ఇబ్బందులు, సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాను. – **వంశీకిరణ్, ఇన్‌చార్జి పశు వైద్యుడు**

క్లుప్తంగా

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఇంద్రవెల్లి: రైతులు భూసార పరీక్షలు చేయించాలని ఆదిలాబాద్ వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు శ్రీధర్ చౌహాన్, రాజేశ్వరి, అనిల్ అన్నారు. గురువారం నేల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ, కోరమండల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. నేలల సంరక్షణ, మట్టి నమూనా పరీక్షుల, యాసంగి పంటల యాజమాన్యంపై సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈవోలు నవతేజ్, కోరమాండల్ సిబ్బంది పాపిరెడ్డి, నాగరాజు, కేస్లాపూర్ గ్రామపటేల్ మెస్రం వెంకట్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్చోడ: జీవో నంబర్ 81 ప్రకారం 61 సంవత్సరల వయస్సు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇప్పించాలని గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌కు సంఘం నాయకులు వినతిపత్రం అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 రోజుల పాటు సమ్మె చేసినట్లు వారు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వం వీఆర్‌ఏలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కారించకుండా జాప్యం చేస్తుందని ఆరోపించారు. ఈ విషయం అసెంబ్లీలో ప్రస్తావించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, శ్రీనివాస్, సల్మాన్, విజయ్, భీముడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక

ఇచ్చోడ: మండల కేంద్రంలోని షార్ప్‌గార్డెన్‌లో గురువారం గ్రామాభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అన్నెల లక్ష్మణ్, అధ్యక్షుడిగా పెరుమండ్ల నారాయణ, ఉపాధ్యక్షుడిగా గుమ్మడి భీంరెడ్డి, అబ్దుల్ సాబీర్ జలైజాకు, గొలుసుల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా రేజీగుంట సురేశ్, కోశాధికారిగా వేణుగోపాలచారి, ఉప కార్యదర్శిగా ధరావత్ నరేందర్, చింతల స్వామి, ఐద రాజేశ్వర్, పెంటన్నతో పాటు 25 మందిని ఎన్నుకున్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

నేరడిగొండ: ప్రజాపాలన విజయోత్సవాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో గురువారం మండల కేంద్రంతో పాటు రోల్‌మామడ, కిష్టాపూర్ గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై కళాజాత నిర్వహించారు. తహసీల్దార్ కలీమ్, ఎంపీడీవో రాజ్‌వీర్‌లు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు కుటుంబసర్వే గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నాగోరావు, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, కళాకారులు ఆత్రం గోవింద్‌రావు, రాథోడ్ శంకర్, గోడం ఆశిష్, కుమ్ర నగేశ్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి


మాట్లాడుతున్న ఆడే గజేందర్

బోథ్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని కనుగుట్ట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందజేశారు. పాఠశాలలోని బడి తోటను పరిశీలించారు. విద్యార్థులు ఆయనను ఘనంగా సత్కరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

నేరడిగొండ: కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఇటీవల యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించిన యువజన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి రంగినేని శాంతన్‌రావు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, బోథ్ నియోజకవర్గ యువజన అసెంబ్లీ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డిలను సత్కరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని క్రీడామైదానంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి నిధులు కేటాయించి క్రీడా వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దుబ్బుల చంద్రశేఖర్, దీసీ రమణ, ప్రశాంత్, చట్ల గజ్జయ్య, పర్చ సాయన్న, విలాస్, అరుణ్, రాజారాం, అనిత, విద్యాసాగరా, జనార్దన్, సకేష్, రాంరెడ్డి, కైలాస్, సజన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పరామర్శ

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన జావిద్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. గురువారం విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు.

అయ్యప్ప స్వామి భిక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే

బోథ్: సొనాలలోని రామాలయంలో నిర్వహించిన అయ్యప్ప స్వాము భిక్ష కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను అయ్యప్పస్వాములు శాలువాతో సత్కరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి: భీంపూర్ మండలంలోని ధనోర గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయంలో గణపతి పూజ, అర్చన, హోమంతో పాటు నవగ్రహపూజ పూజలు నిర్వహించారు. చివరి రోజు ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్య, సుధాకర్, చిట్యాల శంకర్, అజయ్, మురళీ, గడ్డం లస్మన్న, అఫ్రోజ్, గంగయ్య, నితిన్, కల్పప్, సంతోశ్ పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేరడిగొండ: జీవో 81 ప్రకారం 61 ఏళ్ల వయస్సు పైబడిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇప్పించే విషయమై అసెంబ్లీలో ప్రస్తావించి, తమకు న్యాయం చేయాలని జిల్లా వీఆర్‌ఏ జేఏసీ నాయకులు కోరారు. గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వీఆర్‌ఏల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తాని హామీ ఇచ్చారు.

మాలల అభివృద్ధికి కృషి చేయాలి

నేరడిగొండ: మాలల అభివృద్ధికి కృషి చేయాలని వడూర్ గ్రామ మాల సంఘం సభ్యులు కోరారు. గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. అనంతరం మాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

‘మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి’



మాట్లాడుతున్న వంగ మహేందర్‌రెడ్డి

ఎదులాపురం: మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి, పీఆర్టీయూటీఎస్ మాజీ రాష్ట్ర సహ అధ్యక్షుడు వంగ మహేందర్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ గురువారం మాట్లాడారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే జిల్లాలో విద్యాభివృద్ధితో పాటు స్థానిక సమస్యలపై గళం వినిపించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము కృష్ణకుమార్, స్వామి, గోవర్ధన్, భాస్కర్, రాజు, తిరుపతి, ప్రభాకర్, వినోద్‌రెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

దేశరక్షణలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న కల్నల్ వికాస్ శర్మ

ఆదిలాబాద్‌టౌన్: దేశ రక్షణలో యువత భాగస్వాములు కావాలని ఎన్‌సీసీ కమాండింగ్ కల్నల్ వికాష్ శర్మ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని డీటీసీ కేంద్రంలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వారం రోజులుగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గురువారం ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. జిల్లాలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పది రోజులు గా శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగిందన్నా రు. ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, ట్రాఫిక్ నిబంధనలతో పాటు ఆయా అంశాల్లో శిక్షణ ఇవ్వడం జ రిగిందన్నారు. అనంతరం శిక్షణ పొందిన క్యా డెట్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ జగ్‌రాం, అశోక్, ఐలయ్య, సి బ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: సమాజ సేవ చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఎంవో వామన్ రావు, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమండ్లు యాదవ్, అమరేందర్, కిషన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు

ఇచ్చోడ: ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సిరిచెల్మ చౌరస్తాలో నాయకులతో కలిసి టపాసులు పేల్చి సంబురా లు నిర్వహించారు. రానున్న రోజుల్లో మారుమూల గ్రామాల్లో మౌలిక వసతులు, రోడ్డు సౌకర్యాలు మెరుగు పడనున్నట్లు పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో త్వరలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బోథ్, ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగా రెడ్డి, సత్యవతి కోటేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహిముద్ ఖాన్, పసుల చంటి, కొత్తూరు లక్ష్మణ్, ముస్తఫా, బద్దం పోతారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలు


బ్యాటింగ్ చేస్తున్న క్రీడాకారుడు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్జీఎఫ్ అండర్–19 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు గురువారం ఉత్సాహంగా సాగాయి. పోటీలను ఎస్జీఎఫ్ సెక్రటరీ కాంతారావు, కన్వీనర్ జాబాడే రాష్ట్ర పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపుగా 25 మంది క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరయ్యారని తెలిపారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బోథ్: సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం ప్రజాపాలన విజయోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్య పాఠశాల అంశాలను ఇతివృత్తంగా చేసుకుని చిత్రాలు గీశారు. ఉత్తమ చిత్రాలు గీసిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆశన్న యాదవ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సచిన్ దేశ్ ముఖ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘పోరుగర్జన’ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

నార్నూర్: ఆదివాసీ అస్తిత్వ పోరుగర్జన సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండలాధ్యక్షుడు అడ శ్రీరామ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో మాట్లాడారు. ఈనెల9న ఆదివాసీ అస్తిత్వ పోరుగర్జన పేరుతో చలో ఇంద్రవెల్లి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం పోరుబాట తప్పదన్నారు. చట్టబద్ధతలేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ గిరిజన యువతీ యువకులకు ప్రత్యేక ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఆదివాసీలపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడండెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మాణిక్ రావు, మడావి సాగర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందిని నియమించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పులిమడుగు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగు నెలల నుంచి సిబ్బంది పిల్లలు ఇబ్బంది పడుతున్నారని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ పని అంగన్‌వాడీ టీచర్ పదోన్నతిపై ఇచ్చోడకు వెళ్లడంతో గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదన్నారు. వెంటనే సిబ్బందిని నియమించి పిల్లలకు విద్యాబుద్ధులు, పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. అదే విధంగా అందోలి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట బాబా శ్యాం, క్రాంతి, సాజిద్, సాయి, తాజ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడే సమావేశం

నార్నూర్: నేడు జిల్లా కేంద్రంలోని బంజారా భవన్ వద్ద ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం విస్తత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్‌రెడ్డి నాయక్ గురువారం తెలిపారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

సన్మానం

సిరికొండ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా విధుల్లో చేరిన ఎస్సై శివరాంను గురువారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇమామ్, రంజాన్, లక్ష్మణ్, దత్తు, రసీద్, రఘురామ్, సాజిద్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని మేడిగూడ గ్రామానికి చెందిన కుంర సత్యవతి కోటేశ్ ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్‌గా ఎన్నిక కావడంతో గురువారం మేడిగూడలో ఆదివాసీ సంఘుల నాయకులు శాలువాతో సన్మానించారు. ఆత్రం మహేందర్, కాత్లే విఠల్, మాడావి భీంరావు, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు సర్కిల్ నరేశ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం నయబ్ తహసీల్దార్ హరిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. పేద కుటుంబాలకు ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, ఎకర సాగు భూమి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాకేశ్, గణేష్, రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో గురువారం టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాజేందర్, జనరల్ సెక్రెటరీగా శ్యాంసుందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈసందర్భంగా జిల్లా జనరల్ సెక్రటరీ అశోక్ మాట్లాడుతూ.. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమస్యలపై పని చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

‘సీఎం రేవంత్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు’

ఎదులాపురం: సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వ పాలనకు త్వరలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు, కౌశిక్ రెడ్డిల అక్రమ అరెస్టును త్రీవంగా ఖండిస్తూ గురువారం ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నియంతృత్వ పాలనను ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరుడుతుందన్నారు. అరెస్టులను ఆపకుంటే సీఎం రేవంత్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అశోక్


అశోక్

తాంసి: తాంసి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జామిడి గ్రామానికి చెందిన అశోక్ ఎన్నికయ్యారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తన గెలుపునకు కృషి చేసిన సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ బలోపేతం చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని అన్నారు.

బోథ్ అధ్యక్షుడిగా రాజు

బోథ్: బోథ్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా యాటకారి రాజు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు గురువారం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అబ్రార్, చంటి, మహమ్మద్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం


ప్రారంభిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా 10 కంప్యూటర్లు, 2 ప్రింటర్లు, 1 ఇన్వెర్టర్లు, 40 ఫ్యాన్‌లు మంజూరు చేయడం జరిగిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ తెలిపారు. కేబీ ప్రాంగణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాదాపుగా 90 శాతం మంది గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, కంప్యూటర్ గ్రూప్‌లో అధిక సంఖ్యలో విద్యార్థులు చదువుకుంటున్నారని, ఈ విషయంపై పీవో దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించిన పీవో కంప్యూటర్లు అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. పీవో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని అవకాశాలని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు.

గజేందర్‌ను కలిసిన గ్రామస్తులు

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌ను వడూర్ గ్రామానికి చెందిన ఎస్టీ సంఘ సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. భవన ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశమైన సభ్యులు

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు సెర్ప్ ద్వారా అందజేస్తున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ సీసీ రాథోడ్ విజయ అన్నారు. గురువారం మండలంలోని రాజుర గ్రామంలో ఇందిరా మహిళాశక్తి పథకం అమలులో భాగంగా సమావేశం నిర్వహించారు. దుర్గాభవాని గ్రామ సంఘంలోని ఐదు స్వయం సహాయక సంఘాలకు రూ.55లక్షలతో వివిధ పథకాలు మంజూరైనట్లు తెలిపారు. వీటి ద్వారా మహిళలు అభివృద్ధి చెందాలని సూచించారు.

రాజారెడ్డికి నివాళి

బేల: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గు రువారం దివంగత మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి 2వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, సామ రూపేష్‌రెడ్డి, వాంఖడే వామన్, గావుండే ఘ నేశ్యాం, దేవ్‌తాళే విఠల్, బొక్రే శంకర్, మడావి చంద్రకాంత్, కన్యరాజు, మెస్రం భరత్, కరీం పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్‌గా తుల దత్తు


తుల దత్తు

బోథ్: సొనాల గ్రామానికి చెందిన తుల దత్తు ఇటీవల విడుదల చేసిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో సత్తా చాటి ఉద్యోగం సాధించాడు. జంతుశాస్త్రంలో మల్టీజోన్– 1లో 36వ ర్యాంకు సాధించాడు. ఒకవైపు వ్యవసాయం చేస్తూ.. మరోవైపు గురుకుల పాఠశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఆయనను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899